క్లుప్తంగా

ఊరూరా శోభాయాత్ర



శోభాయాత్ర చేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో పుష్కర (షష్టాబ్ది) పూర్వక మహాకుంభాభిషేకం, శ్రీ శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా భక్తులు ఆదివారం మండలంలో ఊరూరా శోభాయాత్ర నిర్వహించారు.

సేవాలాల్ జయంతి రోజున సెలవు ప్రకటించాలి

టేకులపల్లి: రాష్ట్రంలో 40 లక్షలకు పైగా జనాభా ఉన్న బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి రోజు ఫిబ్రవరి 15న ప్రభుత్వం అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు మూడ్ అనిల్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

మిర్చి రైతులను ఆదుకోండి..

టేకులపల్లి: మండలంలో మిర్చి రైతులను ఆదుకోవాలని పీవైఎల్ టేకులపల్లి మండల కార్యదర్శి బానోతు క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బానోత్ సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... ఆరుగాలం మిర్చి పంటను రక్షించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారని, తీరా పంట చేతికొస్తే గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాకు రూ.25వేల మద్దతు ధరను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా నేడు ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈనెల 10న హైదరాబాద్‌లో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మంచికంటి భవన్‌లో ఆమె మాట్లాడుతూ.. మహిళల, పేద ప్రజల సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులు లేవని విమర్శించారు.

రామగుండం కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా వెంకటేష్



టేకులపల్లి: ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్ పట్టభద్రుల (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులను నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. ఇందులో భాగంగా టేకులపల్లి మండలానికి చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా వెంకటేశ్‌ను రామగుండం నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా నియమించారు.

మంగాయమ్మ మృతికి సంతాపం

జూలూరుపాడు: వెంగన్నపాలెం గ్రామానికి చెందిన హైదరాబాద్ ఏసీపీ సబ్బతి విష్ణుమూర్తి తల్లి మంగాయమ్మ మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆదివారం దశదిన కర్మ కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పలువురు నాయకులు, అధికారులు, జర్నలిస్టులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంగాయమ్మ కుమారులైన ఏసీపీ విష్ణుమూర్తి, శివమూర్తిలను పరామర్శించి, సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో తోట రామాంజనేయులు, యల్లంకి సత్యనారాయణ, దుద్దుకూరి మధుసూదన్ రావు, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, యల్లంకి పుల్లయ్య, మాచినేని సత్యనారాయణ, వేల్పుల నరసింహారావు, రాంశెట్టి రాంబాబు, సాయిల కృష్ణయ్య, దుద్దుకూరి నరసింహారావు, బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, చనుమోలు సుబ్బారావు, యల్లంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, ఎస్కే చాంద్‌పాషా ఉన్నారు.

సీతారాంపట్నంపై చిన్నచూపేల?

- సీసీ రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం
- అధ్వానంగా మారిన రోడ్డుతో అవస్థలు
- మిషన్ భగీరథ పైపులైన్ కోసం కిలోమీటరు మేర కందకం
- నిత్యం ప్రమాదాలు



అధ్వానంగా సీతారాంపట్నం వెళ్లే రోడ్డు

పాల్వంచ: పాల్వంచ పట్టణంలో సీతారాంపట్నం ఏరియా అభివృద్ధిపై పాలకులు, అధికారులు చిన్నచూపుచూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. సరైన రోడ్లు, విద్యుత్ దీపాలు, మంచినీటి పంపులు లేక అవస్థలు పడుతున్నారు.

ఇటీవల కేఎస్‌పీ రోడ్డు నుంచి సీతారాంపట్నం వరకు సీసీ రోడ్డుకు నిధులు మంజూరు కాగా ఆ పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రాళ్ల రోడ్డులో నిత్యం స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కాలనీ సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ల కోసం కందకాలు...

మిషన్ భగీరథ పైపులైన్ల కోసం రోడ్డు పక్కన కందకాలు తీశారు. పైపులు వేసిన అనంతరం మట్టిని అక్కడక్కడా పూడ్చకుండా వదిలేయడంతో పెద్ద పెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. అసలే రోడ్డు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్న స్థానికులకు ఈ గుంతలు ఇప్పుడు మరింత ప్రమాదకరంగా మారాయి. ఇదిలా ఉండగా గట్టాయిగూడెం మీదుగా సీతారాంపట్నంకు వెళ్లే రోడ్డులో మిషన్ భగీరథ పైపులైన్ కోసం సుమారు కిలోమీటరు వరకు రోడ్డు పక్కన కందకాలు తవ్వి వదిలేశారు. దీని వల్ల ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. మిషన్ భగీరథ పనులు పూర్తి చేసిన అన్ని ఇళ్లకు నీళ్ల వచ్చేలా చూడాలని, తీసిన గుంతలు పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇటీవల వెలసిన కాలనీలకు అన్ని వసతులు కల్పిస్తున్న అధికారులు పాత సీతారాంపట్నం ఏరియాను మాత్రం విస్మరిస్తున్నారని వాపోతున్నారు.

వెలగని వీధి దీపాలు..

సీతారాంపట్నం కాలనీ విశాలంగా ఉంటుంది. అయితే ఈ కాలనీకి వెళ్లే రెండు మార్గాల్లో పలు వీధి దీపాలు వెలగడం లేదు. ఈ ఏరియాలో దేవాలయాలు, ఇళ్లల్లో దొంగలు పడుతుండటం పరిపాటిగా మారింది. పశువులు, మేకలను సైతం ఎత్తుకెళ్తున్నారు. కాలనీలో వీధిలైట్లు సరిగా లేకపోవడంతో దొంగల భయం ఎక్కువగా ఉందని పలువురు వాపోతున్నారు. కాలనీలో వీధి దీపాలు వెలిగేలా చూడాలని కోరుతున్నారు.



మిషన్ భగీరథ గుంత పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



రోడ్డు పక్కన కిలోమీటరు మేర మట్టి తీసిన దృశ్యం

కాలనీలో రోడ్లు అధ్వానం...



కాలనీలో సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. కేఎస్‌పీ రోడ్డు నుంచి సీతారాంపట్నంకు వచ్చే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభించడం లేదు. రాళ్ల రోడ్డుపై రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించాలి. – అల్లి మణితేజ, సీతారాంపట్నం

కందకాలు తీసి వదిలేశారు...



మిషన్ భగీరథ పైపులైన్ కోసం సీతారాంపట్నంలో కందకాలు తీసి సక్రమంగా పూడ్చలేదు. దీంతో ఏ వీధిలో చూసినా గుంతలే ఉన్నాయి. గట్టాయిగూడెం నుంచి సీతారాంపట్నం వరకు రోడ్డు పక్కన మట్టి తీసి వదిలేశారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. – బోళ్ల ప్రణేష్, సీతారాంపట్నం

రోడ్డు పనులు నిలిచాయి...



మిషన్ భగీరథ పైపులైన్ పనులు జరుగుతున్నందున కేఎస్‌పీ రోడ్డులోని సీసీ రోడ్డు పనులు ఆగాయి. ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. వీధి దీపాలు కూడా వెలిగేలా చూస్తాం. – కె.సుజాత, మున్సిపల్ కమిషనర్

సమష్టి కృషితో అగ్రస్థానం



చైర్మన్ రాంబాబును సత్కరిస్తున్న ఉద్యోగులు

ఇల్లెందు: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు సమష్టి కృషితో ఆదాయ వనరు సాధనలో అగ్రస్థానంలో నిలిచామని, కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం కల్పించాలని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కింది స్థాయి ఉద్యోగులు కోరారు. ఆదివారం మార్కెట్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో సెక్యూరిటీ గార్డులు, డీఈఓలు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, సెక్రెటరీ నరేష్‌లను సత్కరించారు. అనంతరం వారి సమస్యలపై సాగిన ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని మార్కెట్‌ల కంటే అత్యధికంగా ఆదాయం రాబట్టడంతో తాము ముందున్నామని గార్డులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు లక్ష్మి, విజయ, లక్ష్మయ్య, రంజిత్, మోహన్‌రావు, మధు, రమేష్, శ్రీనివాస్, చందర్, కార్తీక్, రవి, సదానందం, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రిబ్యూషన్ పెన్షన్ కోసం పోరాటం

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఏప్రిల్ 1 నుంచి అమలులోకి తీసుకొస్తున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీం విధానాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగి కంట్రిబ్యూషన్ లేని పెన్షన్ హక్కు సాధించే వరకు పోరాడుతామని టీఎస్‌సీపీఎస్‌ఈయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఇల్లెందు జేకే సింగరేణి హైస్కూల్ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004 తరువాత నియామకం పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఎఫ్ఆర్‌డీఏ చట్టం అమలులోకి తెచ్చి సీపీఎస్ విధానంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వృద్ధాప్యాన్ని చీకటిలో పడేసిందన్నారు. కనీసం ఆసరా పెన్షన్‌కి వచ్చినంత డబ్బులు కూడా రాక ఉద్యోగులు రోడ్డున పడే పరిస్థితిలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఉందన్నారు. పోరాటం చేసి గ్రాట్యూటీ, చనిపోయిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలకు కుటుంబ పెన్షన్ సాధించుకున్నామని తెలిపారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో మరో కొత్త విధానం తీసుకురావటం టీఎస్‌సీపీఎస్‌ఈయూ వ్యతిరేకిస్తుందన్నారు. ఈ విధానం అములోకి వస్తే పోరాడి సాధించుకున్న హక్కులు కోల్పోతామని పేర్కొన్నారు.

మార్చి 2న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద జరగనున్న ధర్నాకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, రమణ, నాగునాయక్, హతీరామ్, శంకర్, సురేష్, రమేష్, పగడయ్య, లింగ్యా, వెంకటేశ్వర్లు, బాలాజీ, ఆదినారాయణ, నరేష్, బన్సీలాల్, చిన్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు చలో హైదరాబాద్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ ఆందోళనకు టీజీటీటీఎఫ్ నాయకుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ సంపూర్ణ మద్దతు తెలిపారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వండి..



మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచరూరల్: పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల విశ్వనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉలవనూరు, చంద్రాలగూడెం గ్రామాల్లో శాఖ మహాసభలు నిట్టా అమృతారావు, వజ్జ ఆదినారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పోడు సాగు చేసుకుంటున్న సాగుదారులకు పట్టాలు అందించి రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ గ్రామపంచాయతీలో గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కూనంనేని కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నూతన కమిటీ గ్రామకార్యదర్శిగా నిట్టా అమృతారావు, సహాయ కార్యదర్శులుగా బేతం మురళీ, చంద్రాలగూడెం గ్రామ కార్యదర్శి ఈసం చిన్న శేషయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వినంశెట్టి పూర్ణచందర్‌రావు, వేములపల్లి శ్రీనివాసరావు, దారా శ్రీనివాసరావు, కుంజ రాందాస్, వజ్జ నారాయణ, వెంకన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

జూలూరుపాడు: పాపకొల్లు (అన్నారుపాడు), పడమటనర్సాపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జూలూరుపాడు విద్యుత్ శాఖ ఏఈ సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాపకొల్లు, పడమటనర్సాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం



మాట్లాడుతున్న ఉక్లా

సింగరేణి(కొత్తగూడెం): ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని, వీటి సాధనకు ఈనెల 16న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఉక్లా పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు.

హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఇల్లెందురూరల్: ఏజెన్సీ గౌడ కులస్తులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏజెన్సీ గౌడ కులస్తుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ నరాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. చల్లసముద్రం గ్రామపంచాయతీలో ఆదివారం గౌడ కులస్తుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలోని గౌడ కులస్తులకు ఆర్టికల్ 342 ఐదో షెడ్యూల్ ప్రకారం ఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వాలని, సొసైటీల పునరుద్ధరణ చేపట్టాలని, రాజ్యాంగపరమైన అన్ని హక్కులు కల్పించాలని కోరారు. ఆయా డిమాండ్లపై ప్రతిపక్ష నేత హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నేడు తమ డిమాండ్లపై ప్రభుత్వం మౌనం వహించడం సరైంది కాదన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో భాగంగా ఉద్యమాలు చేపట్టేందుకు నిర్ణయించామన్నారు. ఇందుకు ఈనెల 16న ముకుందాపురం గ్రామంలో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు గౌడ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బందం నాగయ్య, గాదె వెంకటేశ్వర్లు, పబ్బు శ్రీను, అయిలు యాకయ్య, నారాయణ, శ్రీను, వెంకటేశ్వర్లు, కోటయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు 'కాసాని'



సింగరేణి(కొత్తగూడెం):అయిలయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న నబీ

సింగరేణి(కొత్తగూడెం): ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాట యోధుడు కాసాని అయిలయ్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. ఆదివారం స్థానిక మంచికంటి భవన్‌లో కాసాని అయిలయ్య సంస్మరణ సభ సీపీఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా కాసాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. తన జీవితాన్ని పార్టీకి ప్రజలకు అంకితం చేసిన ధన్యజీవి కాసాని అని కొనియాడారు. మచ్చ వెంకటేశ్వర్లు, ఎంఎస్ రెడ్డి, సలిగంటి శ్రీనివాస్, ఏజే రమేష్, న్యాయవాదులు పుల్లయ్య, నాగేశ్వరరావు, తొగరు రాజశేఖర్, భూక్యా రమేష్, డి.వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: భూపోరాట ఉద్యమాల ద్వారా పేదలకు ఇంటి స్థలం చూపించి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా కాసాని అయిలయ్య నిలిచారని సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ అన్నారు. సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్ తండా గుడిసెవాసుల కాలనీలో శనివారం కాసాని అయిలయ్య సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మన్యం మోహన్‌రావు, తాళ్లూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'హోలీవుడ్' ఆలోచన అభినందనీయం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలో మొట్టమొదటి సారి హోలీవుడ్ కార్యక్రమ ఆలోచన చేయడం అభినందనీయమని జై భీమ్‌రావు భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ అన్నారు. వచ్చే నెల 14న పట్టణంలోని ప్రగతి మైదానంలో జరగనున్న హోలీవుడ్ వాల్ పోస్టర్లను ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. మాట్లాడుతూ..

సంస్కృతి, సంప్రదాయాల మేళవింపే హోలీ పండుగ అని, దేశంలో విభిన్న మతాలు, కులాల సాంస్కృతిక రంగాలకు నిలయంగా ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మన దేశంలో ఉన్నాయన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. నేటి సాంకేతిక యుగంలో మెట్రో నగరాల్లో మాత్రమే నిర్వహించే కార్యక్రమం మొట్టమొదటిసారి కొత్తగూడెం పట్టణంలో సంప్రదాయ రంగులు, డీజే సౌండ్, రైన్ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొగ్గిళ్ల గణేష్, అభి, బన్ను, శ్యామ్, శివ తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి..

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహిస్తున్న చలో హైదరబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు ఆదివారం మండలంలోని కొమరారం గ్రామంలో ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మూడు మాలు, వాంకుడోత్ మోతీలాల్, వేప రాణి, జోగ బాబు, వెంకన్న, పుణ్యవతి, వెంకటమ్మ, మైసమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

పునాదుల్లోనే ప్రభుత్వ భవన నిర్మాణాలు



పునాదులకే పరిమితం అయిన గిరిజన భవన్



పనులు నిలిచిన అంబేద్కర్ భవన నిర్మాణం

- అటు బంజారా.. ఇటు అంబేద్కర్
- ఏళ్లు గడిచినా పూర్తి కాని వైనం
- అధికారుల పర్యవేక్షణా లోపంతో ముందుకు సాగని పనులు

ఇల్లెందు: రూ.కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న ప్రభుత్వ భవన నిర్మాణాలు పునాదులు, పిల్లర్ల దశలోనే ఉన్నాయి. 2022 ఫిబ్రవరి 15న బంజారా భవన్, గడిచిన మే 18న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్ నిర్మాణాలకు శంకుస్థాపన జరిగింది. ఈ రెండు భవన నిర్మానాలు ఇప్పుడప్పుడే పూర్తయ్యేలా కనిపించటం లేదు.

బంజారా భవన్‌కు రూ.1.20 కోట్లు కాగా అంబేద్కర్ భవన్‌కు రూ.2.15 కోట్లతో చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఇదే అంబేద్కర్ భవనానికి గతంలో రూ.1.15 కోట్లు మంజూరు కాగా ఆ నిధులు సరిపోవని ఇంజనీరింగ్ అధికారులు సూచించటంతో మరో రూ.కోటినిధులు డీఎంఎఫ్ నుంచి కేటాయించారు. ఇక బంజార భవన్‌కు కూడా నిధులు సరిపోవంటున్నారు.

సభలు, సమావేశాలు, శుభకార్యాలకు ...

నూతనంగా నిర్మించే బంజారా, అంబేద్కర్ భవనాల్లో శుభకార్యాలు, సభలు, సమావేశాలు జరుపుకోవాలని అందుకు అనువుగా ఉండేలా పనులు చేపట్టారు. కానీ ఈ రెండు భవన నిర్మాణాలను నిర్ణీత సమయానికి పూర్తి చేసే పరిస్థితి లేదు. ఈ భవనాల్లో సుమారు 1000 మంది సీటింగ్ సామర్థ్యంతో నిర్మించాల్సి ఉంది. రెండు విశ్రాంతి గదులు, రెండు వంట గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, వాష్ బేసిన్‌లు, మంచినీటి బోరు, మోటారు, వాటర్ ట్యాంకు, ప్రహరీ ఏర్పాటు చేయాల్సి ఉంది.

త్వరగా పనులు పూర్తి చేయాలి..

గిరిజన భవన్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఇటీవల గిరిజన సంఘం నేతలు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏడాదిగా పునాదులకే పరిమితం అయిందని ఆయన దృష్టికి తెచ్చారు. ఏటా సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించుకునేందుకు, సభలు, సమావేశాల కోసం ఇబ్బందిగా ఉందని గిరిజన సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులు స్పందించాలి...



గిరిజనుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది కానీ ఆ నిధులతో చేపట్టాల్సిన భవనాలు అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ స్పందించాలి. గిరిజన సంఘాల సభలు, సమావేశాల ఏర్పాటుకు అడ్డంకులను తొలగించాలి. – బానోతు రవినాయక్, ఇల్లెందు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కొత్తగూడెంఅర్బన్: 1979-80 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



ఇల్లెందు: 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



పాల్వంచ: 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: కూలీలైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1979–80 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మరణించిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రవి బాలనికేతన్ హెచ్ఎం వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లెందు: పట్టణంలోని మెయిన్ రోడ్ హైస్కూల్ 2006–07 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో గెట్ టు గెదర్ కార్యక్రమంలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఆనందంగా గడిపారు.

పాల్వంచ: బాపూజీనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984–85లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం కలుసుకుని సందడిగా గడిపారు. 40 ఏళ్ల తర్వాత పాత జ్ఞాపకాలను నెమరవేసుకుని ఉల్లాసంగా గడిపారు. కనగాల బాలకృష్ణ, కొమరవెల్లి రవీందర్, దాసు, మంత్రి ఓంప్రకాష్, సుధారాణి, కిలారు నిర్మల పాల్గొన్నారు.